సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం ၊ 21 ၊ మార్చి ၊ 2023



గల్ఫ్ వలసల పోస్టర్ విడుదల

వేములవాడ: గల్ఫ్ వలసలు, మోసాలపై పోస్టర్‌ను బీజేపీ ఎన్నారై సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ నరేంద్ర పన్నీరు సోమవారం విడుదల చేశారు.



క్వింటాల్ పత్తి రూ.7400

జమ్మికుంట వ్యవసాయమార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,400, కనిష్టంగా రూ.6,600 ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
30.0/21.0

వాతావరణం

ఆకాశం ప్రశాంతంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

అంతా మాయ !



- ఇది వేములవాడ శివారులోని తిప్పాపూర్–జయవరం మధ్య పిల్లిగుండ్ల వైపు ఇటీవల కొత్తగా వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్. గేటెడ్ కమ్యూనిటీ తరహాలో గేటును నిర్మించి, రోడ్డు వేసి, చుట్టూరా ప్రహరీ నిర్మించారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండానే వ్యవసాయ భూమిని ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వినియోగిస్తున్నారు. ఇది ఒక్కటే కాదు.. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల పరిసరాలతోపాటు పల్లెల్లోనూ ఈ తరహా రియల్ ఎస్టేట్ దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

- జిల్లాలో 'రియల్' మోసాలు
- 113 అనుమతి లేని వెంచర్లు
- వేములవాడలోనే 67 వెంచర్లు
- రాష్ట్రంలోనే జిల్లాది రెండో స్థానం
- శ్రీగంధం చెట్ల పేరిట వ్యాపారం
- నాలా కూడా చెల్లించని వైనం
- వ్యాపారులకు రూ.కోట్లు.. కొన్న వారికి పాట్లు



సిరిసిల్ల శివారులోని అక్రమ వెంచర్‌లో రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో పల్లె నుంచి పట్టణం వరకు అనుమతి లేని వెంచర్లు ఎక్కడిపడితే అక్కడే కనిపిస్తున్నాయి. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే పంటపొలాలను రియల్ వెంచర్లుగా మారుస్తూ ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఇలాంటి అక్రమ వెంచర్లలో రాష్ట్రంలోనే జిల్లా రెండోస్థానంలో



వేములవాడ శివారులో అనుమతి లేకుండా వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్ గేటు

ఉంది.

జిల్లాలోని ఒక్క వేములవాడలోనే 67 వెంచర్లలో 452.99 ఎకరాల్లో వ్యవసాయ భూములు పాట్లుగా మారినట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో అనుమతి లేని లే అవుట్ వెంచర్ల వివరాలను ఇటీవల సేకరించాలని పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. 'పట్టణ ప్రగతి' వెబ్‌సైట్‌లో వాటి వివరాలను నమోదు చేశారు. జిల్లాలో 113 అనుమతి లేని వెంచర్లు ఉన్నట్లు స్పష్టమైంది.

చట్టానికి చిక్కకుండా ఎత్తులు

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మున్సిపల్, గ్రామపంచాయతీల్లో చట్టాలకు చిక్కకుండా వ్యాపారం చేస్తున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చినప్పుడు వ్యవసాయేతర భూమి పన్ను(నాలా) చెల్లించాలి. మొత్తం భూమిలో 10 శాతం స్థలాన్ని సామూహిక అవసరాలకు మున్సిపల్ లేదా గ్రామపంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేయించాలి. నిబంధనల ప్రకారం రోడ్లు, మురికికాల్వలు వంటి వసతులు కల్పించాలి. కానీ హద్దురాళ్లు పాతి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. హద్దురాళ్లు పాతితే మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారని భావించిన రియల్ వ్యాపారులు ఇటీవల మొక్కలను హద్దురాళ్లుగా నాటి ప్లాట్లు విక్రయిస్తున్నారు. హద్దురాళ్లుగా పెద్ద పెద్ద శ్రీగంధం, ఎర్రచందనం, కొబ్బరి చెట్లను నాటుతున్నారు. ఆ చెట్ల ద్వారా 12 ఏళ్ల తరువాత అతి విలువైన కలప వస్తుందని నమ్మబలుకుతూ రియల్ మోసాలకు పాల్పడుతున్నారు.

ఇది మాటల మాయాజాలం

చెట్లను నాటి ప్లాట్ల దందా చేస్తున్న రియల్ వ్యాపారులు అన్నీ అబద్ధాలే చెబుతున్నారు. ఎర్రచందనం మొక్కలు మన ప్రాంతంలో అంత నాణ్యతగా ఉండవు. చందనం కర్రను నాణ్యత లేకుంటే ఎవరూ కొనరు. శ్రీగంధం మొక్కలు కనీసం 20 నుంచి 25 ఏళ్లు పెరిగితే కర్రలోని లోపలి భాగం(శ్యాగ) నాణ్యతగా ఉంటేనే కొంటారు. రాయలసీమ ప్రాంతంలో ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. ఈ చెట్లను కొట్టి విక్రయించేందుకు వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ, అటవీశాఖల అనుమతి పొందాలి. రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్వాహకులు 12 ఏళ్లకే శ్రీగంధం మొక్కలకు లక్షల రూపాయల ఆదాయం వస్తుంది, ప్లాటు జాగా మిగులుతుందని చెబుతూ జనాన్ని మోసం చేస్తున్నారు. ఈ వెంచర్‌లకు లేఅవుట్ అనుమతి లేదు. నాలా చెల్లింపులు అసలే లేవు. దీంతో ప్లాటు కొన్నవారు భవిష్యత్‌లో ఇల్లు నిర్మించుకోవాలంటే గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల నుంచి అనుమతులు రాక ఇబ్బందులు పడతారు.

రిజిస్ట్రేషన్ కాకుండా కట్టడి చేస్తాం



జిల్లాలో అనుమతి ఉన్న వెంచర్లు కొన్నే. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొంటే రిజిస్ట్రేషన్ కాకుండా కట్టడి చేస్తాం. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలతో సబ్‌రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలో అనుమతి లేని ప్లాట్లు కొంటే భవిష్యత్‌లో నిర్మాణ అనుమతులు రావు. ప్లాటు కొన్న వారు నష్టపోతారు. జిల్లాలో లేఅవుట్ లేకుండా వెంచర్లు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు కట్టడి చేస్తారు.

– అన్సారీ, డీటీసీపీ, అధికారి, సిరిసిల్ల

ఎటు చూసినా వెంచర్లే..

- సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో పుట్టగొడు గుల్లా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి. వీటిని రాజకీయ నాయకులు, పట్టణాల్లో ప్రముఖులు నిర్వహిస్తుండడంతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం పెద్దగా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ వెబ్‌సైట్‌లోనూ వీటిని నమోదు చేయలేదు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ పాలకవర్గాలతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని ప్లాట్ల వ్యాపారం సాగిస్తున్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, రుద్రంగి, బోయినపల్లి, తంగళ్లపల్లి మండలాల్లోనూ వెంచర్లు ఉన్నాయి. ముఖ్యంగా సిరిసిల్ల, వేములవాడ పట్టణాల శివారుల్లోని గ్రామాల్లో అక్రమ వెంచర్లు అధికంగా ఉన్నాయి. అనుమతి లేని ప్లాట్లను వ్యాపారులు అమ్ముతూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు. కళ్ల ముందే రియల్ మోసాలు జరుగుతుంటే అధికారులు ముడుపులు దండుకుని కళ్లు మూసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో మున్సిపల్ సిబ్బంది, కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు హద్దు రాళ్లను తొలగిస్తున్నారు. మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. పేపర్‌పైనే ప్లాట్ల మ్యాప్‌లు వేసి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక తరగతులకు హాజరుకావాలి



నేరెళ్ల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరుకావాలని జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ కోరారు. నేరెళ్లలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హన్మాండ్లు



హన్మాండ్లును సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన పర్శ హన్మాండ్లును రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ సోమవారం నియమించారు. పర్శ హన్మాండ్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీలను, అనుబంధ విభాగాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ కోరారు. ముదిరాజ్ మహాసభ నిర్దేశించుకున్న లక్ష్యాలను నెరవేర్చుతానని హన్మాండ్లు తెలిపారు. హన్మాండ్లును జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు కోడి అంతయ్య, ప్రతాప్ తదితరులు సన్మానించారు.

జిల్లాలో ఖేలో ఇండియా కేంద్రం

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో ఖేలో ఇండియా కేంద్రం నిర్వహణకు ఆసక్తి గల క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాధికారి కె.ఉపేంద్రరావు ప్రకటనలో తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, సైక్లింగ్ తదితర యాభై క్రీడాంశాల్లో ఏదేని ఒక కేంద్రాన్ని మినీ స్టేడియంలో నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆలిండియా యూనివర్సిటీ స్థాయి, ఖేలో ఇండియా జాతీయస్థాయి పతకం విజేత, చాంపియన్‌షిప్ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు అర్హులుగా పేర్కొన్నారు. పది పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సంబంధిత ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తును కలెక్టరేట్‌లోని 19వ నంబర్ గదిలోని జిల్లా క్రీడల శాఖ కార్యాలయంలో ఈనెల 24లోపు అందజేయాలని సూచించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కోనరావుపేట(వేములవాడ): కంటివెలుగు రెండో విడతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. మామిడిపల్లిలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. అంధరహిత సమాజ నిర్మాణం కోసమే సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఉచితంగా పరీక్షలు చేస్తూ, అద్దాలు అందిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కొక్కుల భారత, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కులేరు రవి, నాయకులు రాఘవరెడ్డి, తక్కళ్ల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

నేరాల అదుపునకు సహకరించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నేరాల అదుపులో ప్రజలు సహకరించాలని సీఐ మొగిలి కోరారు. అక్కపల్లిలో సోమవారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు గ్రామానికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సై శేఖర్, సర్పంచ్ మధుకర్, వీపీవో రమేశ్ పాల్గొన్నారు.

ఆలకించండయ్యా !



- చంకలో బాబుతో అసహాయంగా చూస్తున్న ఈమె పేరు ఆకారం రాజేశ్వరి. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన రాజేశ్వరి దినసరి కూలి. భర్త బాల ఎల్లం. వీరి పెద్ద కొడుకు భవిత్‌కుమార్ మానసిక వికలాంగుడు. 2022 నవంబరులో సదరం సర్టిఫికెట్ జారీ అయింది. బాబుకు ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేశారు. కానీ ఇప్పటి వరకు రాలేదు. పెన్షన్ ఇప్పించాలని వేడుకుంటూ.. రాజేశ్వరి జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించింది.

- ఉపాధి చూపాలని చీర్లవంచ యువకులు..
- ఆదుకోవాలని బాధితుల విన్నపాలు
- ప్రజావాణిలో 34 వినతులు



దివ్యాంగురాలు విజయకు వీల్‌చైర్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

- ఈ యువకులది చీర్లవంచ. మధ్యమానేరు జలాశయంలో ఊరు మునిగిపోయింది. దీంతో వారికి ఉపాధి కరువైంది. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం హారతికర్పూరంలా కరిగిపోగా.. ఇప్పుడు ఏం పనిచేయాలో తెలియక పునరావాసకాలనీలో ఉంటున్నారు. దళితబంధులో లేదా ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ఉపాధి కల్పించాలని పదకొండు మంది యువకులు కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం అందించారు.



సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో బాధితులు కలెక్టర్‌ను కలిసి విన్నవించేందుకు బారులు తీరుతున్నారు. ఈ సోమవారం ఏకంగా 34 మంది వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. ఇందులో రెవెన్యూపరమైన సమస్యలు 20 ఉండగా.. సిరిసిల్ల మున్సిపాలిటీవి నాలుగు, డీపీవో, ఆర్ అండ్ బీ, ఎల్‌డీఎం, ఇరిగేషన్, ఎంపీడీవో కోనరావుపేట, తంగళ్లపల్లి, డీడబ్ల్యూవో, సర్వేయర్, వేములవాడ మున్సిపాలిటీ, ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ప్రజావాణిలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య, ఎల్‌డీఎం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ పంపిణీ

జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ను అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ అందించారు. సిరిసిల్ల విద్యానగర్‌కు చెందిన వలకొండ విజయకు కాలుపోవడంతో ఆమెకు ప్రభుత్వం ద్వారా వీల్‌చైర్‌ను అందించారు. డీఆర్‌డీఏ ఏపీవో ఎ.పారావు, సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



వేములవాడలో దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీక్ విషయంలో మంత్రి కేటీఆర్ హస్తం ఉన్నట్లు తెలుస్తున్న క్రమంలో మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ డిమాండ్ చేశారు. వేములవాడ తెలంగాణచౌక్‌లోని ఉద్యమాలగద్దెపై నిరసన దీక్ష చేపట్టారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎంపీపీ బండ మల్లేశం, నాయకులు ఎర్రం మహేశ్, రేగుల మల్లికార్జున్, అల్లాడి రమేశ్, మార్త సత్తయ్య, బాలరాజు, సంతోష్‌బాబు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ లీకేజీపై విచారణ చేపట్టాలి

సిరిసిల్లటౌన్: టీఎస్‌పీఎస్సీలో పేపర్ల లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆడెపు రవీందర్ డిమాండ్ చేశారు. 'మా నౌకర్లు..మాగ్గావాలే' నినాదంతో సోమవారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన దీక్షను చేపట్టగా మాట్లాడారు. పేపర్ లీకేజీలపై సీబీఐ కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు రాసిన నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలని కోరారు. ఈసందర్భంగా మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీని తగులబెట్టేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోబోయారు. ఇరువర్గాల మధ్య తోపులాటలు జరిగాయి. దీంతో బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. వారితో పోలీసులు బలవంతంగా దీక్షను విరమింపజేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, శిరస్వాల్ కైలాశ్, చందు, మైసయ్య, రాజు, వేణు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలపై అలసత్వం వద్దు

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వ వహించొద్దని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టి, మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తోపాటు కమిటీ సభ్యులను వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తోడుదొంగలుగా వ్యవహరిస్తున్నారన్నారు. డీఏవో మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, మ్యాకల మునీందర్, లింగంపల్లి మధుకర్ పాల్గొన్నారు.

పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్‌గా కిషన్‌యాదవ్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్‌గా జీల కిషన్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు డీసీవో బుద్ధనాయుడు తెలిపారు. గత నెల 28న చైర్మన్ బర్కం వెంకటలక్ష్మిపై పలువురు డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెలిసిందే. సోమవారం చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించారు. జీల కిషన్ చైర్మన్‌గా, బెజ్జారపు నారాయణ వైస్‌చైర్మన్‌గా గెలిచినట్లు డీసీవో తెలిపారు. జీల కిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌లను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్యనారాయణ, డైరెక్టర్లు రమణారావు, భాస్కర్, బాలరాజ్‌యాదవ్, ఆదిపెల్లి లక్ష్మి, బడుగు లక్ష్మి, మంగ కిరణ్, భాగయ్య, ముష్కం లీల, కిషన్‌నాయక్, రాజేందర్ పాల్గొన్నారు.



చైర్మన్, వైస్‌చైర్మన్‌లను అభినందిస్తున్న నాయకులు

పంట నష్టపరిహారం అందించాలి

- ఎకరానికి రూ.25వేలు చెల్లించాలి
- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: అకాలవర్షం, వడగండ్లతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షంతో పొలాలు దెబ్బతిన్నాయన్నారు. రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. వేలాది ఎకరాల్లోని మొక్కజొన్న, మామిడి, వరి, కూరగాయలు, నువ్వులు, మిర్చిపంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఏటా ప్రకృతి ప్రకోపాలతో రైతులు నష్టపోతున్నారన్నారు. వారిని ఆదుకోవాలని కోరారు. ఈమేరకు అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. టీపీసీసీ సభ్యులు నాగు ల సత్యనారాయణగౌడ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, చొప్పదండి ప్రకాశ్, జెడ్పీటీసీ నాగం కుమార్, గంభీరావుపేట ప్రకాంత్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు





కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అభిషేక ప్రియుడికి నీరాజనం

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అభిషేకాలు, అన్నపూజలకు ముందుగా టోకెన్లు ఇచ్చారు. భక్తుల ఏర్పాట్లను ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని రాజన్నకు స్థానాచార్యులు భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన చేశారు.

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన మేడి రాజు(35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం .. మేడి పోచవ్వ పెద్ద కుమారుడు నర్సింలుకు వివాహం కాగా వేరుగా ఉంటున్నాడు. పోచవ్వ, ఆమె చిన్న కుమారుడు రాజు మరో ఇంట్లో ఉంటున్నారు. రాజు కూలీ పనులు వెళ్లేవాడు. ఈ క్రమంలో అతను అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. వారం రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం తప్పింది. ఇంటికి వచ్చిన రాజు సోమవారం తన తల్లి బయటకు వెళ్లడంతో ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తైబజార్ వేలం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని కూరగాయల మార్కెట్(తైబజార్), పశువుల అంగడిలు నిర్వహణకు వేలం వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య సోమవారం ప్రకటించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు నిర్వహణకు ఈనెల 25న ఆఫీస్‌లో బహిరంగం వేళం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నిర్ణీత సమయంలోపు కూరగాయల మార్కెట్‌కు రూ.3లక్షల డీడీ, రూ.25లక్షలు సాల్వెన్సీ సర్టిఫికెట్, పశువుల అంగడికి రూ.2లక్షల డీడీ, రూ.5లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్లు సమర్పించాలని కోరారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేశ్



నరేశ్‌ను అభినందిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముదిరాజ్ మహాసభ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముస్తాబాద్ మండలం బందనకల్‌కు చెందిన చిగురు నరేశ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ముదిరాజ్ మహాసభలో ఈమేరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించారని నరేశ్ తెలిపారు. హైదరాబాద్ కర్మాన్ ఘాట్‌లోని చంద్రగార్డెన్స్‌లో జరిగిన ముదిరాజ్ సమావేశంలో బాధ్యతలు అప్పగించారని తెలిపారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు.

‘మొక్క’వోని దీక్షతో సంరక్షణ

- ప్రతీ శుక్రవారం ట్యాంకర్లతో నీళ్లు
- ఎండిపోకుండా కాపాడుతున్న సిబ్బంది
- జిల్లాలో 345 ప్రాంతాల్లో మొక్కల సంరక్షణ



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



“ఇది ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లి శివారులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు. వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. నాటిన మొక్కలు ఎండల ధాటికి వాడిపోతున్నాయి. ఈ క్రమంలో గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది ట్యాంకర్‌తో నీళ్లు పోస్తూ మొక్కలు ఎండిపోకుండా చూస్తున్నారు.”



“ఇది కోనరావుపేట మండలం జైసేవాలాల్ భూక్యారెడ్డితండా శివారులోని ఎవెన్యూ ప్లాంటేషన్. రోడ్డు పక్కన నాటిన మొక్కలకు ట్యాంకర్‌తో నీళ్లు పోస్తున్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ప్రతీ శుక్రవారం ఎవెన్యూ ప్లాంటేషన్‌కు విధిగా నీరు పోయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించడంతో ఇలా ట్యాంకర్లతో నీళ్లు పోస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 345 ఆవాస ప్రాంతాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్‌ను సంరక్షించేందుకునేందుకు ట్యాంకర్లతో నీరు పోశారు.”

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను రక్షించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుండగా.. జిల్లా వ్యాప్తంగా 255 గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో 190, ప్రైవేటు భూముల్లో 65 నర్సరీలను ఏర్పాటు చేశారు. కొత్తగా 43.98 లక్షల మొక్కలను పెంచారు. ఈ ఏడాది జిల్లాలోని 12 మండలాల్లో 19,17,248 మొక్కలను హరితహారంలో భాగంగా నాటగా.. 18,40,558 మొక్కలు బతికి ఉన్నాయి. జిల్లాలో వనసంరక్షణను బాధ్యతగా చేపట్టారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఏ గ్రామానికి విజిటింగ్‌కు వెళ్లిన హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటున్నారు. గ్రామసర్పంచులు, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఎవరికి వారు గ్రామాల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ప్రతీ వారం నీరు పోయాలి..



జిల్లాలో ప్రతీ వారం ట్యాంకర్లతో మొక్కలకు నీరు పోయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండలు ముదురుతున్నాయి. ఇలాంటి సమయంలో విధిగా మొక్కలకు నీరుపోయాల్సిందే. ప్రతీవారం ట్యాంకర్లతో నీరు పోస్తూ మొక్కలు ఎండిపోకుండా చూడాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

– ఎ.రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో ఎవెన్యూ ప్లాంటేషన్ స్వరూపం

ఎవెన్యూ ప్లాంటేషన్ లక్ష్యం	: 250 కిలోమీటర్లు
పీఆర్ రోడ్లు	: 148 కిలోమీటర్లు
నాటిన మొక్కలు	: 1,04,419
ఆర్అండ్‌బీ రోడ్లు	: 102 కిలోమీటర్లు
నాటిన మొక్కలు	: 63,350
అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు	: 3,08,617

24న జాతీయ సాహిత్య సదస్సు

- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న జాతీయ సాహిత్య సదస్సు నిర్వహించనున్నారు. సంబంధిత పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆవిష్కరించారు. కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ సాహిత్య సమాలోచన చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాహిత్య సదస్సులో పాల్గొనడం ద్వారా సాహిత్య వికాసం చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, సదస్సు సంచాలకుడు డాక్టర్ ఎం.మల్లారెడ్డి, మానేరు రచయితల సంఘం కార్యదర్శి ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్, వాసరవేని పర్శరాం పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఆ దిశగా ఆశ్రమాల నిర్వాహకులు వారికి బోధనలు చేయాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ మౌజయాశ్రమంలో బుధవారం సుదర్శన చండీ, చక్ర యాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఆశ్రమాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక గురువు, ఆశ్రమ నిర్వాహకుడు రుషి ప్రజ్ఞానంద స్వామితో మాట్లాడారు. ప్రజ్ఞానంద స్వామి సైంటిస్ట్ అయి వుండి, ఆధ్యాత్మికత వైపు రావడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. యువత తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించేలా, సమాజానికి నిస్వార్థంగా సేవ చేసేలా సూచనలు చేయాలని కోరారు.

యాదగిరి గుట్టకు బస్సు నడపండి



వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజుయాదవ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల డిపో నుంచి ఎల్లారెడ్డిపేట మీదుగా యాదగిరి గుట్టకు బస్సు నడపాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాల్‌రాజుయాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. అలాగే ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి నుంచి వ్యాపార, వాణిజ్య దుకాణాలను నిర్వహించేవారు వ్యాపార నిమిత్తం ప్రతీరోజు హైదరాబాద్ వెళ్తున్నారని అన్నారు. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం లేక రాత్రయితే బస్టాండ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. స్పందించిన తహసీల్దార్ డీఎంతో మాట్లాడతానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఫాజుల్‌నగర్ చేరిన కాళేశ్వరం నీరు

- పూజలు చేసిన బీఆర్ఎస్ నాయకులు



ప్రాజెక్టు వద్ద పూజలు చేసిన నాయకులు

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ ప్రాజెక్టులోకి సోమవారం కాళేశ్వరం నీరు చేరింది. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేశారు. 20 వేల ఎకరాలకు ఈ నీరందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు చొరవ తీసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి, సకాలంలో నీటి విడుదలకు కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, నాయకులు నాగుల వేణు, లక్ష్మణ్, యామ తిరుపతి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్

- అమలుకు జీవో 77 జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 93 మందికి వర్తింపు



స్వశక్తి సంఘాల మహిళలతో సమావేశమైన సెర్ప్ ఉద్యోగులు (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పే స్కేల్ వర్తింపజేసింది. మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు సెర్ప్ అందిస్తున్న సేవలు మరువలేనివి. గ్రామాలు, పట్టణాల్లో పొదుపు సంఘాల ఏర్పాటు, సభ్యులకు రుణాలివ్వడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిది. ఈ క్రమంలో వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచుతూ రాష్ట్ర సర్కారు పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ద్వారా జీవో 77 జారీ చేసింది.

ఏప్రిల్ 1 నుంచి అమలు..

21 ఏళ్లుగా సెర్ప్‌లో వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి పేస్కేల్ అమలు చేసేందుకు నిర్ణయించింది. మండల సమాఖ్యలో పనిచేసే వారిని ఆఫీస్ సబార్డినేట్లుగా, ఏపీఎంలను సీనియర్ అసిస్టెంట్ స్థాయిగా, డీపీఎంలను సూపరింటెండెంట్‌గా గుర్తించింది. ప్రాజెక్టు మేనేజర్లను ఎంపీడీవో క్యాడర్‌గా, అడ్మిన్ అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించారు. మండల బుక్ కీపర్లను రికార్డు అసిస్టెంట్లుగా, సీసీలను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించారు. వీరికి పేస్కేల్ ప్రకారం వేతనాలు అందనున్నాయి. ఈపీఎఫ్, ఈఎస్ఐలను రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా వీరికీ ఇస్తారు. హెచ్ఆర్ పాలసీ, సర్వీస్ రూల్స్ అమలు చేస్తారు.

జిల్లాలో సెర్ప్ ఉద్యోగుల వివరాలు..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. మండల సమాఖ్య సీసీలు 15 మంది, ఆఫీస్ అసిస్టెంట్లు నలుగురు, అటెండర్లు ఇద్దరు, మండల బుక్ కీపర్లు ముగ్గురు, సీసీలు 50 మంది, ఏపీఎంలు 15 మంది, డీపీఎంలు ముగ్గురు, ప్రాజెక్టు మేనేజర్ ఒకరు మొత్తం 93 మంది పని చేస్తున్నారు.

సర్కారుకు రుణపడి ఉంటాం



ఏళ్లుగా అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్నాం. ఎలాంటి డీఏ, టీఏలు లేకున్నా ప్రజలకు సేవలందించాం. ప్రభుత్వం పే స్కేల్ అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో మా బాధలు తీరనున్నాయి. సర్కారుకు రుణపడి ఉంటాం. – శోభన్‌బాబు, సీసీ

సీఎంకు కృతజ్ఞతలు



వందలాది మంది ఉద్యోగులం కష్టపడి పని చేస్తున్నాం. మహిళా సంఘాలు, రైతులకు సేవలందించాం. మాకు పే స్కేల్ ఇవ్వడం ఆనందంగా వుంది. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. మరింత బాధ్యతతో పని చేస్తాం. – జయసుధ, ఏపీఎం

మా బాధలు తీరుతాయి..



వేతనాల పెంపుతో మా బాధలు తీరుతాయి. ప్రభుత్వానికి ఏళ్లుగా విజ్ఞప్తులు చేస్తూ వచ్చాం. ఇప్పటికి మా మొర ఆలకించి, వేతనాలు పెంచుతూ జీవో ఇచ్చారు. అలాగే రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి. – నూదుల రాజు, సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.30 వేలు, బంగారు, వెండి ఆభరణాలు అపహరణ
- మరో ఇంట్లో చొరబడగా అడ్డుకున్న కుటుంబసభ్యులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో, జగ్గారావుపల్లెలోని మరో ఇంట్లో దొంగలు పడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. జగ్గారావుపల్లెకు చెందిన ఈసరి రాజనర్సు ఇంట్లోకి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి, దొంగతనానికి యత్నించారు. బాధిత కుటుంబసభ్యులు ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పారిపోయారు. సర్దాపూర్‌కి చెందిన వెంగళ పద్మ ఇంటికి తాళం వేసి, తన కూతుళ్లతో కలిసి బంధువుల వివాహానికి వెళ్లింది. అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళం పగులగొట్టారు. బీరువా తెరిచి, 3 తులాల బంగారు, 13 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.30 వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని నిరుపేదలకు నివేశన స్థలాల పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు కోరారు. సిరిసిల్లలోని ఆర్ఎంపీ భవనంలో సోమవారం ప్రజాసంఘాలతో నిర్వహించిన గెట్ టుగెదర్‌లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలో బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాలు, చమురు ధరలు అధికంగా పెంచేసి సామాన్యుల నడ్డి విరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చర్యలను నిలదీసేలా సీపీఎం చేపడుతున్న జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని కోరారు. మూశం రమేశ్, జువ్వాజి విమల, ఎల్లారెడ్డి, నాగరాజు, స్వప్న, కవిత, దేవదాసు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి రిమాండ్



వేములవాడరూరల్: దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం రాత్రి తెలిపారు. వేములవాడ రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. బోయినపల్లి మండలంలోని నీలోజిపల్లికి చెందిన సత్తయ్య ఇంట్లో గత నెల 3న చొరబడి, బంగారం, నగదు ఎత్తుకెళ్లిన కేసులో నిందితుడు అశోక్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి బంగారం, కొంత నగదును నాలుగు రోజుల క్రితం స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో మరో నిందితుడు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు గ్రామానికి చెందిన సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్‌ను సోమవారం పట్టుకున్నారు. బంగారాన్ని కల్వకుర్తిలోని విక్రమ్‌దాస్ అనే వ్యాపారికి విక్రయించి, ఆయన వద్ద డబ్బు తీసుకున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. దీంతో దొంగ బంగారం అని తెలిసి కూడా కొనుగోలు చేసిన విక్రమ్‌దాస్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.లక్షతోపాటు రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా సాయిబాబాపై దాదాపు 40 కేసులు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐ బన్సీలాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



చికిత్స పొందుతున్న పోచవ్వ

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని దీకొండ, నంచర్ల గ్రామాల్లో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. నంచర్లకు చెందిన జక్కుల పోచవ్వ, పొట్ల రేణ, బుర్ర అనిత, మామిడి రాధ, దీకొండ గ్రామానికి చెందిన మామిడి సౌందర్యలపై దాడి చేసి, కరిచింది. గాయపడిన బాధితులు జగిత్యాల, పెగడపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొంది, తమ ఇళ్లకు చేరుకున్నారు. గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, బయటకు రావాలంటే భయపడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని ఇక్కడి నుంచి తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం, నిందితులను చూపుతున్న పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లెల్ల శివారులో సోమవారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సైలు మారుతి, రాజేశ్, తిరుపతి, మహిపాల్‌లు మాట్లాడుతూ.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లెల్లకు చెందిన శంకర్, శ్రీనివాస్‌లు రెండు ట్రాలీ ఆటోల్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వాహనాలను, బియ్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, అక్రమంగా రవాణా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

28న జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు

- నేటి నుంచి నామినేషన్లు
- జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మయ్య



మాట్లాడుతున్న హన్మయ్య

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు ఈనెల 28న నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మయ్య తెలిపారు. స్థానిక నెహ్రూనగర్ భవాని ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. హన్మయ్య మాట్లాడుతూ సంఘం బైలా ప్రకారం మూడేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. మంగళవారం నుంచి శనివారం వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులుగా గంద్ర బాలకిషన్‌రావు, మారం మహేశ్, గాజుల శ్రీనివాస్, మందాల ప్రసాద్ బాబులను నియమించినట్లు వివరించారు. ఈనెల 28న రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయని, రేషన్ డీలర్‌గా ఆథరైజేషన్ ఉన్న వ్యక్తులు మాత్రమే ఓట్లు వేయాల్సి ఉంటుందన్నారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. రేషన్‌డీలర్ల సంఘం మండలాల ప్రతినిధులు ఎం.డీ.సికిందర్, వై.ఎల్లయ్య, ఎస్.రాజేశం, శేఖర్‌బాబు, రాజ్యలక్ష్మి, రణధీర్, శ్రీనివాస్, కృష్ణయ్య, రాజు, శ్రీనివాస్, దేవయ్య, చంద్రకళ, సత్యనారాయణ, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు



లింగంపల్లి శివారులో వంగిన విద్యుత్ స్తంభం



రోడ్డును ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వేములవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు రోడ్ల పక్కనే ఉన్నాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్లను ఆనుకొని ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామంలో పది రోజుల క్రితం పత్తిని తరలిస్తున్న వ్యాన్‌కు విద్యుత్ తీగలు తగలడంతో పత్తి దగ్ధమైంది. ఇలా చాలా గ్రామాల్లో లూజ్‌వైర్లు, వంగిన స్తంభాలు, రోడ్లను ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా వాటిని సరిచేయాలని కోరుతున్నారు. ఇటీవల సెస్ ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఎన్నికైన లింగంపల్లి గ్రామానికి చెందిన ఆకుల దేవరాజం సొంత గ్రామంలోనే ఈ సమస్యలు ఉన్నాయంటే ఇక మిగతాచోట్ల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని పలువురు అంటున్నారు.